# ఈ వారం కథ

తాత్కాలికంగా ఉద్రిక్త పరిస్థితి సడలింది. బ్రతుకు జీవుడా అనుకున్నాను.

అసలేం జరిగిందంటే-

నిన్న సాయంత్రం వంట వంతు నాదీ.

కాని డ్యూటీ నుంచి రావడం ఆలస్యమైంది.

జనరల్ షిఫ్టు గనుక అయిదున్నరకల్లా వచ్చేస్తాను. నిన్న ఏడు దాటింది.

పద్మిని అయిదున్నరకే ఇంటికి వచ్చేసింది. తనే కాఫీ పెట్టుకుని తాగి అలాగే మంచంమీద ఒరిగిపోయింది. దీపం కూడా వెయ్యలేదు.

ఇల్లంతా చీకటిగా వుంది. వీథి వరండా తలుపు దగ్గరికి వేసి వుంది. గడియ పెట్టలేదు.

"నువ్వు ముందుగా వచ్చావుకదా కాస్త వంట పని ప్రారంభించలేక పోయావా" అన్నాను. కాస్త చిరాగ్గానూ కోపంగానూ అని వుంటాను.

వాతావరణం భగ్గుమంది.

"అలసటగా వుందని పడుకున్నాను. పైగా ఈ పూట వంట చెయ్యవలసింది నువ్వు కదా" అని నర్రుమంది.

"నిజమేలే. ముందొచ్చావు కదా. అలా వూరికినే పడుకోకపోతే బియ్యం కడిగి కుక్కర్‌లో పెట్టొచ్చుకదా" అన్నాను. అనకుండా వుండవలసింది. తనే ఏవో నాలుగు మాటలాడి వూరుకొని వుండును.

సెగలు, పొగలు ప్రారంభమయ్యాయి.

బట్టలు మార్చుకుని, బాత్ రూమ్‌కి వెళ్ళి కాళ్ళూ చేతులూ మొఖం కడుక్కుని ఇంత కాఫీ పెట్టుకుని తాగి, నా మానాన్న నేను పని ప్రారంభించాను.

అవతలి గదిలోంచి మంటలూ మెరుపులూను.

నేను ఉత్తరాంధ్రా కెమికల్స్‌లో జూనియర్ కెమిస్టుగా పనిచేస్తున్నాను. నిన్న నాది జనరల్ షిఫ్టు. పని నాలుగు గంటలకే అయిపోతుంది. లాబ్‌లోంచి బోలెడు దూరం నడిచి గేటుదాటి వచ్చి రెండు సిటీబస్సులు మారి, ఆ తరువాత మళ్ళీ బోలెడు దూరం నడిచి ఇల్లు చేరేసరికి అయిదుదాటిపోతుంది. నిన్న పని కొంచెం ఎక్కువ. ఇల్లు చేరేసరికి ఏడు దాటిపోయింది.

పద్మిని విశాఖ ఇండస్ట్రీస్ మేనేజ్‌మెంట్ సెక్షన్‌లో టైపిస్టు. ఒకోరోజు ఆమెకూ పని ఎక్కువయి అలిసిపోయి విసుక్కుంటుంది. ఆఫీసు పనికంటే-సిటీ బస్సులో వెళ్ళి రావడంవల్ల బాగా అలసట వస్తుంది.


మాది ఒకరకంగా ఆదర్శ వివాహం. ఇద్దరం అభ్యుదయ భావాలుగల కుటుంబాల నుంచి వచ్చిన వాళ్ళం. పెళ్ళి చేసుకుందామని అంగీకారానికి వచ్చేముందే కొన్ని విషయాల్లో అంగీకారానికి వచ్చాం. (పెళ్ళికి ముందు మేం ప్రేమించుకోలేదు. పరిచయాలు మాత్రం వున్నాయి). నెల రోజులు నేను వండాలి, మరొక నెల రోజులు ఆమె వండాలి-అనుకున్నాం ముందు. కొంత చర్చ తరువాత నెలలో పదిహేను రోజులు నేను వండాలి. మరొక పదిహేను రోజులు ఆమె వండాలి. అని ఒప్పందానికి వచ్చాం. ఎవరి బట్టలు వాళ్ళే ఉతుక్కోవాలి. అనారోగ్యం, తీరుబడి లేనంత పని మొదలైన సందర్భాల్లో మాత్రం ఒకరికొకరం సాయం చేసుకోవాలి. అలాగే ముందు ముందు పుట్టబోయే బిడ్డల పెంపకం, ఇంటి ఖర్చు, స్వంత ఇంటి కోసం చెయ్యబోయే ఖర్చు-ఇలా అన్నింటా పని నుంచి బాధ్యత, ఖర్చు వరకు సమాన భాగస్వామ్యం అని కూడా ఒప్పందానికి వచ్చాం.

సుమారు రెండేళ్ళుగా ఇలా బాగానే నడుస్తోంది జీవితం ఈ విధంగా కూడా చాలా సుఖంగానే వుంది. కొద్ది నెలల్నించీ ఇటువంటి చిన్న చిన్న గొడవలు ప్రారంభమయ్యాయి. పద్మినికి విసుగు ఎక్కువయింది. నా విసుగుకు కారణం మీ మగవాళ్ళే ననడం ప్రారంభించింది. ఆఫీసులో జరుగుతున్న సంఘటనలు, ఇంట్లో మా ఇద్దరి మధ్య జరుగుతున్న సంఘటనలు కూడా ఉదహరించి చెబుతోంది. నేను వంటచేస్తూ పదే పదే తనని పిలుస్తూంటానట. స్థిమితంగా వుండనివ్వనట. తను చేస్తున్నప్పుడు నన్ను సాధారణంగా పిలవదట. ఈ ఉదాహరణ చూపించేసరికి ఒప్పుకోక తప్పలేదు. సరే. దేనికైనా సామరస్యం అన్ని విషయాలూ పరస్పరం చర్చించుకోవడం ముఖ్యం గనక సర్దుకు పోతున్నాను.

విన్నటి గొడవ అలాంటిది కాదు.

రోజూ వేసినట్టే స్విచ్చివేస్తే హాయిగా లైటు వెలగవలసింది పోయి బల్బు ఫట్‌మని పగిలిపోయినట్టు, అసలు వైరింగంతా కాలిపోయి పొగలూ సెగలూ లేచినట్టూ తయారయింది పరిస్థితి.

దిగ్భ్రాంతి-ఆశ్చర్యం-భయం-అన్నీను.




వెంటనే ఏమీ మాట్లాడలేక పోయాను.

వంట చెయ్యడం కూడా ఒక సాంకేతిక నైపుణ్యమేనని నన్ను గుర్తించమంటుంది పద్మిని. అదీ సారాంశం.

ఏ పనయినా ఇద్దరం సమానంగా చేసుకోవాలన్నంతవరకూ ఒప్పుకుంటాను. నేను మా లాబ్‌లో పనిచెయ్యడం లేదా కంప్యూటర్స్‌తో పనిచెయ్యడం, లేదా కాంప్లికేటెడ్ మెషినరీతో పనిచెయ్యడం ఎంత నైపుణ్యంతో కూడినపనో ఆఫ్టరాల్ వండటం కూడా అంత నైపుణ్యంతో కూడిన పనేనని ఎలా ఒప్పుకోవడం?

ఒకసారి ఇంట్లో కూరల్లేవు. నాలుగో అయిదో వడిలిపోయిన వంకాయలున్నాయి. ఆ వంకాయల్తోనే పద్మిని అద్భుతంగా కూర తయారుచేసింది. నేను ఆ పూట ఏ ఆవకాయ పచ్చడితోనో, ఆమ్లెట్‌తోనో సరిపెట్టేద్దాం అనుకున్నాను. తీరా కూర నోట్లో వేసుకునేసరికి ఎంత రుచిగా వుందో చెప్పలేను. వంకాయ కూరంతా నేనే తినేశాను. పద్మిని ఆ రోజు నిజంగానే ఆవకాయ పచ్చడితో తినవలసి వచ్చింది. తినవలసినదాన్ని నేనిక్కడ వున్నానని గుర్తులేదా అని గసరబోతే, మాటల్తో కితకితలు పెట్టేశాను.

ఇంకోసారి నేను గోంగూర పచ్చడి చేశాను. మర్నాటికే బూజుపట్టేసింది. పద్మిని దెబ్బలాడింది. మార్కెట్‌కి వెళ్ళి నాలుగయిదు చోట్ల ఎంచి ఎంచి గోంగూర తనే తీసుకొచ్చావనీ, చేతకానప్పుడు పూనుకోకుండా, తనుదునమ్మావనీ తయారుచెయ్యబోయి తగలబెట్టేశావని తిట్టిపోసింది. తనేచేసి వుంటే వారం పది రోజులు తిని వుందుం, ఇలా అయితే సంసారం చేసినట్టేనన్నది.

తప్పు నాదే గనక వూరుకున్నాను. తమా వూరుకోవచ్చు కదా. లాబ్‌లో టై ట్రేషన్ చేసినట్టు కాదు, గోంగూర పచ్చడి చెయ్యడం అంటేనన్నది. రీడింగులమీద రీడింగులు తీసి ఏసిడ్ కంటెంట్ పర్సెంటేజ్ లెక్కకట్టగానే సరికాదంది.

నాకు వళ్ళు మండిపోయింది.

ఎమ్మెస్సీ ఫస్టు క్లాసులో పాసయి అయిదేళ్ళయి జూనియర్ కెమిస్టుగా పనిచేస్తున్నాను. పైగా నేనేం పనికిమాలిన కంపెనీలో పని చెయ్యడం లేదు, కేంద్ర ప్రభుత్వ అనుమతీ, గ్రాంటూ వున్న కంపెనీలో చేస్తున్నాను. నన్ను పట్టుకుని అంతమాటంటే కోపం రాదూ?

అంతెందుకూ ఒక్క తప్పులేకుండా పెద్ద పెద్ద స్టేట్‌మెంట్లు టైపు చెయ్యడం, వంట వండిపారెయ్యడం ఒకటే ఎలా అవుతుందీ, సైంటిఫిక్ నాలెడ్జి టెక్నాలజీ ట్రయినింగూ, ఎక్స్‌పీరియన్సూ, సీనియారిటీ-ఇదంతా పట్టిదేనా?

వంటలో కూడా బోలెడు టెక్నికల్ నాలెడ్జి వుందట.

మొండి మనిషితో వాదించి లాభం లేదని, పరిస్థితిని చాకచక్యంగా పక్కకి మళ్ళించి నవ్వుల్లోకి దించాను.

మళ్ళీ-నిన్న రాత్రి అదేమాట. అదే వాదన.

వంటచేస్తే రుచిగా వుండాలి. పోషక విలువలు పోకూడదు. మిగిలిపోతే నిలవ వుండాలి. ఇదంతా సాంకేతిక పరిజ్ఞానం, టెక్నికల్ నాలెడ్జి కాదా అంటుంది. తరతరాలుగా ఆడవాళ్ళం వంట చేస్తున్నాం, మా జీవితాలన్నీ వంట చేస్తూ గడిపాం. ఉద్యోగం కోసం ట్రయినింగయితే ఏడాదో, రెండేళ్ళో వుంటుంది. కొద్ది సంవత్సరాల ట్రయినింగూ, తరతరాలుగా జీవితాలకు జీవితాలు ఒకేపనిచేస్తూ గడపడం ఒకటెలా అవుతుందీ? ఆ మాట కొస్తే మా సాంకేతిక పరిజ్ఞానం, అనుభవం ముందు మీ చచ్చు ట్రెయినింగులు ఏపాటివి?-అంటుంది.

ఈ మధ్య స్త్రీవాదం-అదే ఫెమినిజం బాగా తలకెక్కింది పద్మినికి. పెళ్ళికి ముందు బాగానే మాట్లాడేది. బీజింగు మహిళా సదస్సుకు వెళ్ళే అవకాశం రాలేదని తెగ నొచ్చుకుంది. వెళ్ళి వుంటే ఇంకెలా మారి వుండునో.

నాకూ ప్రగతిశీల భావాలు లేకపోలేదు. మార్క్సు మొదలైన వాళ్ళ పుస్తకాలు పూర్తిగా చదవకపోయినా మార్క్సిజాన్ని నమ్మేవాళ్ళతో దగ్గర పరిచయం వుంది. కనుకనే ఆదర్శ వివాహం చేసుకున్నాను. స్త్రీలను తక్కువగా చూడకూడదని, విద్యలో ఉద్యోగాల్లో వాళ్ళకు సమానావకాశాలు ఇవ్వాలని ఒప్పుకుంటాను. బొట్టూ గాజులూ మంగళ సూత్రాలూ మట్టెలూ ఇవన్నీ పురుషులు స్త్రీలపై బానిసత్వ చిహ్నాలుగా రుద్దారని అంగీకరిస్తాను. మా పెళ్ళి ఏ మంగళ సూత్రాలూ, మంత్ర తంత్రాలూ కట్న కానుకలూ లేకుండానే జరిగింది. ఇది బహిరంగ సత్యం.

వంట గురించి పద్మిని చెప్పినవి కొంతవరకు సమంజసమైన మాటల్లా వున్నాయి. తన భావాలపై తనకు బలమైన నమ్మకం గనుక, ఎంతసేపటికీ వాదన మానదు.

టమాటా పప్పు వండాను. చారు కాచాను. ఒడియాలు వేయించాను. అనవసరంగా తగువుకు దిగింది కాని లేకపోతే ఇద్దరికీ ఆమ్లెట్లు కూడా వేద్దామనుకున్నాను.

"దోపిడీ చేసేముందు చులకనచేసి అవమానించడం మగవాళ్ళ వర్గ స్వభావం. ఇంట్లో కూచుని వండటమేకదా అంటారు దానికీ బోలెడు పరిజ్ఞానం కావాలి. ఏ బియ్యం ముద్దగా వుడుకుతుందో ఏ బియ్యం పలుకుగా వుడుకుతుందో తెలియాలి. కాయ గూరల్లో చేదు చూడాలి. ఏ కూర ఎలా వండితే బాగుంటుందో తెలియాలి. ఒక కూర అనేక రకాలుగా వండటం రావాలి. టిఫిన్ల దగ్గిర్నుంచి పిండివంటల వరకు అన్నీ చెయ్యడం రావాలి. మిగిలిపోతే పాడయిపోకుండా సద్వినియోగం చెయ్యడం రావాలి. అన్నం మిగిలిపోతే మర్నాడు పులిహోరచేసి టిఫిను సరిపెట్టాలి. పప్పు మిగిలినా వాసన రాకుండా చూడాలి. ఏ పప్పుచారో చెయ్యాలి. మెషిన్లతో పనిచెయ్యడానికి ఎంత సాంకేతిక పరిజ్ఞానం కావాలో, ఇంటిల్లిపాదికీ సకాలంలో సమస్తమైన వంటలూ చేసి మెప్పించాలన్నా అంత పరిజ్ఞానమూ కావాలి" ఇంకా ఇలా ఆవేశంగా చాలా చాలా మాట్లాడింది. ఉదాహరణలు కూడా చెప్పింది.

వాదనలోకి దిగితే ఓడిపోతానేమోనని భయం వేసింది.

"దోపిడీ చేసేముందు చులకనచేసి నీచంగా చూసి అవమానించడం దోపిడీదారుల వర్గ స్వభావం. ఎంత చదువుకున్నా, ఎన్ని ఆదర్శాలు 'నిర్వాకం' చేసినా మగవాళ్ళు ఆ స్వభావంలోంచి బయట పడటం చాలా చాలా కష్టం" అని మళ్ళీ మొదటి కొచ్చింది.

"ఎన్నెన్ని సేవలూ, పనులూ చేయించుకున్నా-సమయం వస్తే ఆడవాళ్ళ గురించి పరమ నీచంగా ఆలోచిస్తారు, మాట్లాడతారు మీ మగవాళ్ళు. వంటలుచేసే మగవాళ్ళు పూర్వకాలం నుంచీ వున్నారు. ఎంత ఇష్టంగా వంట చేసినా వాళ్ళ మనసులోంచి "ఇది ఆడపని" అనే భావం ఛస్తే పోదు. ..."

చెరిగి పోసేస్తున్నది. ఇక లాభం లేదని వంట ముగించి డాబా మీదికి వెళ్ళిపోయేను.

** ** **

తెల్లవారి లేచి మొహం కడుక్కోవడానికి బయలుదేరుతుంటే "వాదనలో ఓడిపోతానని భయం వేసి, డాబా మీదికి వెళిపోయేనా?" అని దెప్పింది. ఈ ఆడవాళ్ళకి నిజాలు ఎలా తెలిసి పోతాయో తెలియదు.

"అబ్బే అదేం లేదు. వంట చెయ్యడానిక్కూడా ఎంతో తెలివీ, అనుభవం, ఓర్పూ వుండాలని ఒప్పుకుంటా' 'నన్నాను చాలా మామూలుగా. "టెక్నికల్ నాలెడ్జి, సాంకేతిక పరిజ్ఞానం" అనే మాటలు ఎత్తలేదు" ఈ సారికి ఆ మాత్రం ఒప్పుకున్నావు కదా-మరొకసారి అదెంత టెక్నికల్ నాలెడ్జితో కూడుకున్నపనో ప్రాక్టికల్‌గా చేసి చూపించి నీ చేత ఒప్పిస్తాను చూడు" అన్నది.

మొహం తుడుచుకుందుకు తువ్వాలు తీశాను.

వచ్చేవారంకథ

గొడ్డు దొంగ

-కొలకలూరి ఇనాక్